నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,30 మే 2024

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కాకినాడ, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, ల్యాబ్ లు మరియు స్కానింగ్ కేంద్రముల వైద్యులు మరియు స్టాఫ్ నర్సుల వివరములను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఆదీణవీ) కార్యక్రమములో భాగంగా హెల్త్ ఫెసిలిటి రిజిస్ట్రేషన్, హెల్త్ పర్సనల్ రిజిస్ట్రేషన్ మెయింటెనెన్స్ తప్పనిసరిగా అందరూ నమోదు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డా.జె. నరసింహానాయక్ తెలియజేసినారు. HPR WEB SITE: https://hprid.abdm.gov.in/register?origin=NDR, HER WEB SITE : https://facility.abdm.gov.in/. ఈ వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా వారి వ్యక్తిగత మరియు స్టాఫ్ వివరాలు తప్పనిసరిగా నమోదు చెయ్యవలెనని ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, ల్యాబ్ లు మరియు స్కానింగ్ కేంద్రముల యాజమాన్యం వారు భవ్య హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ అండ్ ఎంట్రో ల్యాబ్ అనే ఏజెన్సీ వారికి పూర్తి సహకారం అందించి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రక్రియలో భాగంగా హెచ్.పి.ఆర్ మరియు హెచ్.ఎఫ్.ఆర్. డేటాను ఆన్‌లైన్ లో నమోదు చెయ్యాలని ఆదేశించారు.

జూన్ 4 నాటి ఓట్ల లెక్కింపు కోసం

కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లు పూర్తి

- కౌంటింగ్ కేంద్రం లోకి అనుమతించే ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు జారీ
- కలెక్టర్ ద్వారా 144 సిఆర్ పిసి సెక్షన్,ఎస్పి ద్వారా 30 పోలిసు యాక్ట్ పై ఉత్తర్వులు జారీ
- ఈవిఎమ్, పోస్టల్ బ్యాలెట్, ఈటిపిబిఎస్ ఓట్లు లెక్కింపు అనుగుణంగా చర్యలు
- ఈవిఎమ్ ఓట్ల కోసం పిసి పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్ . ఏసి పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్,
- ఈటిపీబిఎస్ కోసం 4 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ కోసం 20 టేబుల్స్ ఏర్పాటు
- ఓట్ల లెక్కింపు కోసం తగిన మానవ వనరుల సిద్ధం చేశాం
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత . ఎస్పి జగదీష్

రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4 వ తేదీ మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధం అవ్వడం జరిగిందని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా కె.మాధవీలత తెలియ చేశారు. మంగళ వారం సాయంత్రం న్యూఢిల్లీనుంచికేంద్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుంచి ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కౌంటింగ్ ప్రక్రియ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత ,ఎస్పి పి. జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ కే.దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్శ్రీవాత్సవ్ఇతరరిటర్నింగ్,సహాయ రిటర్నింగ్ అధికారు లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె . మాధవీ లత మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా జూన్ 4 మంగళవారం రోజున చేపట్టనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చెయ్యడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రం లోకి కౌంటింగ్ సిబ్బంది, ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిన వారిని ,ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యే ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులను, ఎన్నికల ఏజెంట్స్, కౌంటింగ్ ఏజెంట్స్ లని మాత్రమే అనుమతించడం జరుగుతుందనీ తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది కి తొలి ర్యాండమైజేషన్ పూర్తి చేశామని తెలిపారు. నియోజక వర్గాల వారీగా గుర్తింపు కలర్ కోడ్ ఇస్తూ వారిని తప్ప ఆయా నియోజక వర్గాల కౌంటింగ్ హాల్‌లోకి ఇతర వ్యక్తులను అనుమతించడం జరగదన్నారు .ఇందుకోసం ఇప్పటికే రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్స్‌కు అవగాహనకల్పించడం జరిగిందని పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బంది ,ఈసిఐ ద్వారా గుర్తించిన అధికారం పొందిన వ్యక్తులు, ఎన్నికల విధులు సంబంధించి ప్రభుత్వ అధికారులు , అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. ఈవిఎమ్ , పోస్టల్ బ్యాలెట్, ఈటిపిబిఎస్ ఓట్లు లెక్కింపు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లో భాగంగా ఈవిఎమ్ ఓట్ల కోసం పిసి పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్ , ఏసి పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్, ఈటిపీబిఎస్ కోసం 4 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ కోసం 20 టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అసెంబ్లి, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన ఓట్లు లెక్కింపు కోసం సహాయ రిటర్నింగ్ అధికారులు 7 గురు, కౌంటింగ్ సూపర్వైజర్ లు 119, సహాయకులు 126 , సూక్ష్మ పరిశీలకులు 140 ,ఇతర సిబ్బంది 119 మంది చొప్పున నియమించినట్లు తెలిపారు.పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్లు లెక్కింపు కోసం తగిన సిబ్బందిని నియమించామన్నారు. సిసిటివి 24 x 7 నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు, కమాండ్ కంట్రోల్ రూం, మీడియా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలియచేశారు. 152 సీసీ కెమెరాలు, పోలీసులు ఆధ్వర్యంలో 7 సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని మాధవీలత తెలిపారు. ఎస్పీ పిజగదీష్ మాట్లాడుతూ, నన్నయ్య యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. యూనివర్సిటీ ఆవరణలో ఒక కీలో మీటరు పరిధిలో 144 సెక్షన్ , 30 పోలిస్ యాక్ట్ అమలులో ఉన్నట్లు తెలిపారు. ఒక కంపెనీ కేంద్ర ఆర్మ్డ్ పోలీస్ బలగాలు, ఒక ప్లాటూన్ ఏపీఎస్పి బలగాలు, ఇద్దరూ అదనపు ఎస్పీలు, 9మంది డీఎస్పీలు, 9 మంది సీ ఐ లు, 16 మంది ఎస్ ఐ/ఆర్ ఎస్ఐలు, 30 మంది ఏ ఆర్ ఎస్ఐ , 25 మంది హేడ్ కానిస్టేబుల్స్, 128మందిపోలీస్ కానిస్టేబుల్స్ ,63మందిహెూంగార్డులు నియమించి నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ కే దినేష్ కుమార్ రాజమండ్రి సిటీ, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ కొవ్వూరు అసెంబ్లి నియోజక వర్గ పరిధిలో చేపట్టనున్న కార్యచరణ ను వివరించడం జరిగింది. ఈ సమావేశంలో ఎస్పి పి జగదీష్, రాజమండ్రీ రూరల్ ఆర్వో జెసి-ఎన్.తేజ్‌భరత్,రాజమండ్రిఅర్బన్ఆర్వో, మునిసిపల్ కమిషనర్ కే. దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో , సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్,జిల్లా రెవిన్యూ అధికారి జీ. నరసింహులు, రాజానగరం ఆర్వో/ ఆర్డీఓ ఏ. చైత్ర వర్షిణి, గోపాలపురంఆర్వో - కె ఎల్ శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎమ్. మాధురీ, నిడదవోలు ఆర్వో ఆర్.వి.రమణా నాయక్ ,రాజమండ్రీ పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి - ఎస్.డి.సి. ఆర్.కృష్ణా నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎమ్. భాను ప్రకాష్, పి.సువర్ణ,సహాయరిటర్నింగ్అధికారులు,పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన

పెద్దాపురం,మేజర్న్యూస్ : పెద్దాపురం ప్రధమ శ్రేణి శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే జిల్లా గ్రంధాలయ కార్యదర్శి వాట్సప్ ద్వారా పంపిన నీతి కథలను వినిపించడం జరిగింది. ఉపాధ్యాయులు రాళ్ళపల్లి వెంకటేశ్వరరావు స్పోకెన్ ఇంగ్లీష్‌పై విద్యార్థులకు బోధించడం జరిగింది. వానపల్లి సత్యనారాయణ విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంధాలయ పాఠకులు అరవింద్, రాజేష్, కాటంరాజు, రామారావు, సిబ్బంది సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలి

పెద్దాపురంమేజర్ న్యూస్ : విద్యార్థులందరూ సామాజిక బాధ్యతతో మెలగాలని, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డా.చెలికాని స్టాలెన్ అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం, పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తీర్ణ స్థాధించిన ప్రధమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు అభినందన సభ పిసిసి గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డా.స్టాలెన్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలని, అలాగే సమాజంలో విద్యార్థులు బాధ్యతగా మెలగాలన్నారు. గురువుల పట్ల, తల్లితండ్రుల పట్ల, గౌరవంతో మెలుగుతూ, సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న అభివృద్ధిని, మన అభివృద్ధికే వాడుకోవాలి తప్ప, తప్పుడు పనులకు వాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సొసైటి అధ్యక్షులు ముప్పన వీర్రాజు, ఎంఇఓ ప్రభాకర శర్మ, డా.జోశ్యుల కృష్ణబాబు, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రభాకర వర్మ, ఎం.ఎస్.సి.మూర్తి, బి.అనంతరావు, పలువురు, చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ,రొంగల అరుణ్ కుమార్, రవి కుమార్, పూజిత, సూర్యశ్రీ, వలంటీర్లు అమృత, సాయి, నేహ, రేణుక, పవన్‌కుమార్, మణికంఠ, వివేక్, గౌస్, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటి నుండి ఐదవ తరగతి వరకు 6743 పాఠ్యపుస్తకాలు

- ఎంఈఓ సూర్య రెడ్డి

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్: ఒకటి నుండి ఐదో తరగతి వరకు బుధవారం6743 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ సూరయ్య రెడ్డి తెలిపారు. పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో రాలేదని అలానే నాలుగో తరగతి పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. వీటిని స్థానిక ఆశ్రమ బాలుర పాఠశాలలో భద్రపరచడం జరిగిందని ఎంఈఓ తెలిపారు. నాల్గవ తరగతితో పాటు7 8 తరగతులకు పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందని ఎంఈఓ తెలిపారు. 9 10 తరగతులకు పాఠ్యపుస్తకాలు ఇదివరకే వచ్చి ఉన్నాయని అలానే నోట్ బుక్ లు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. సీఆర్పీలు శ్రీను, విష్ణు సిబ్బంది ఉన్నారు.

ఉసులుమర్రు అభయాంజనేయ స్వామికి పుష్కర మహా కుంభాభిషేకం

పెరవలి, మేజర్ న్యూస్ : ఉసులుమర్రు గ్రామంలో నెలకొన్న అభయాంజనేయ స్వామికి పుష్కర మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కొత్తూరు వీర్రాజు తెలియజేశారు. మే 29వ తేదీ బుధవారం ఉసులుమర్రు గ్రామంలో మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ మే నెల 31వ తేదీ శుక్రవారం నాడు 1116 కలసాలతో గోదావరి జలాలతో అభిషేకం చేస్తామని భక్తులు తెచ్చిన గోదావరి జలాలను స్వామివారిపై అభిషేకించడానికి స్వామివారి వెనక అరపలు కట్టి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే రోజు పంచామృతాభిషేకం చేస్తామని మహా కుంభ నివేదన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. జూన్ 1వ తేదీ శనివారం హనుమతజయంతి సందర్భంగా తమలపాకులతో పూజలు ఇతర పూజా కార్యక్రమాలు చేస్తామని తదుపరి భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఓట్ల లెక్కింపు అయ్యేంత వరకూ బాణాసంచా తయారు, విక్రయాలు నిషేధం

సామర్లకోట,మేజర్న్యూస్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సామర్లకోట తహశీల్దార్ కార్యాలయంలో సామర్లకోట బాణాసంచా కేంద్రాల నిర్వహకులతో తహసిల్దార్‌వైశ్రీనివాస్‌ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సెట్రాజ్ సిఇఒ, జిల్లా ప్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎవిఎస్ ఎన్ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఓట్ల లెక్కింపు దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బాణాసంచా తయారీ దారులు తయారీ, క్రయ, విక్రాయాలు నిషేదించినట్టు హెచ్చరించారు. లైసెన్స్ లో ఉన్న వారు, లైసెన్సు లేని వారైనా బాణాసంచా తయారీ, విక్రయాలు చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.శాంతి భద్రతల పరిరక్షించేందుకు గాను వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సై మౌనిక, వీఆర్వో నల్లజర్ల మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఓట్లు లెక్కింపుకు ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్

రంపచోడవరం, మేజర్ న్యూస్ : వచ్చే నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద గట్టీ భద్రత మధ్య ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ వచ్చేనెల నాలుగో తేదీన రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పార్లమెంటుకు 20 కౌంటింగ్ టేబుల్స్, అసెంబ్లీకి 20 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా పార్లమెంటు, అసెంబ్లీకి వేరువేరుగా ఒక్కొక్క టేబుల్‌కు నలుగురు చొప్పున కౌంటింగ్ సిబ్బంది ఉంటారని, అదేవిధంగా అసెంబ్లీకి 80 మంది, పార్లమెంటుకు 80 మంది కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఒక్కొక్క టేబుల్‌కు ఎన్నికల్లో పోటీ చేసిన 12 మంది అభ్యర్థులు, ఒక్కొక్క టేబుల్‌కు ఒక్కొక్క ఏజెంట్ ను నియమించ నున్నట్లు ఆయన తెలిపారు. రెవిన్యూ శాఖ నుండి మరో 200 మంది అధికారులను, సిబ్బందిని కౌంటింగ్ విధుల కోసం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడం కొరకు కౌంటింగ్ రోజున కౌంటింగ్ కేంద్రం చుట్టుప్రక్కల గట్టి భద్రతతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రహించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మామిడి పండా..బంగారమా..?

కాకినాడ, మేజర్న్యూస్ : వేసవి కాలంలో మాత్రమే మామిడి పండ్లు దొరుకుతాయని అందరూ చెపుతారు. కానీఇదిఅబద్ధం.కాదు అనుకుం టున్నారా. అలా అనుకుంటే పొరపాటు పడ్డట్టే. 365 రోజులు మామిడి పండ్లు దొరుకుతాయి. అయితే ఫ్రిజ్‌లో ఉంచో శీతల గిడ్డంగిలో నిల్వ ఉంచినవో కాదు. 365 రోజులు చెట్టుకు కాస్తాయి. ఇది ఆశ్చర్యంగా ఉన్నా, వింతగా అనిపిస్తున్నా నిజమైన నిజం. వివరాలలోకి వెళితే.. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలు కు చెందిన అభ్యుదయ రైతు ఓదూరి నాగేశ్వరరావు. వ్యవసాయ, ఉద్యాన పంటలు పండించడంలో దిట్ట. చిన్ననాటి నుండి కష్టపడి పైకి వచ్చారు. పూర్తిగా వ్యవసాయం ఆయనకు ఆధారం. కానీ ఆయన పండించే పంట మాత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎవరూ పండించలేరంటే ఆశ్చర్యం కాదు. ఆయనకు నాలుగు ఎకరాల తోట ఉంది. ఆ తోటలో ఆయన పండించే మామిడి రకాల గురించి చూస్తే మియా జాకి, ఐదు కేజీల మామిడి, అరటిపండు మామిడి, యాపిల్ మామిడి, నల్లమామిడి ఇలా 20 రకాల మామిడి చెట్లు ఆయన తోటలో ఉన్నాయి. ఇది కాక సపోటా, నలుపు రంగు నేరేడు .. ఇలా ఎన్నో పండ్లు పండిస్తున్నప్పటికీ ముఖ్యంగా ఆయన మామిడిలో దిట్ట. జపాన్ నుంచి మొక్కలు తెప్పిస్తారు. తన తోటలో పెంచుతారు. మియా జాకీ మామిడిపండు ఖరీదు కేజీ అక్షరాల 2 లక్షల 70 వేల రూపాయలు. ఆశ్చర్యపోకండి. ఇది ఆయుర్వేద మందుల్లో ఎక్కువగా వాడుతారు. చాలా అరుదైన పండు. అదేవిధంగా యాపిల్ మామిడి, అరటిపండు మామిడి ఇవి కూడా అత్యంత ఖరీదైనవే. ఆయనకు ఇంకో అలవాటు కూడా ఉంది. ఆయన చెట్టు నుంచి కోసిన మొదటి పండును పవన్ కళ్యాణ్ కి పంపుతారు. అలాగే ఆయన సేంద్రీయ వ్యవసాయం చేస్తూ బ్లాక్ రైస్ పండిస్తున్నారు. కేజీ బ్లాక్ రైస్ 250 రూపాయలు. సాధారణంగా సన్నాలు రకం బ్లాక్ రైస్ ఉంటుంది. కానీ ఈయన పండించేది బాస్మతి బ్లాక్ రైస్. దీనికి మరింత డిమాండ్ ఎక్కువ. అదే విధంగా చాలామంది బ్లాక్ రైస్ పండిస్తారు. ఎకరానికి 15 బస్తాల దిగుబడి వస్తుందంటారు. కానీ నాగేశ్వరరావు సేద్యంలో దిట్ట కావడంతో ఎకరానికి 50 బస్తాలు పండిస్తున్నారు. ఇది కూడా తొలుత పవన్ కళ్యాణ్‌కి పంపిస్తారు. ఇక్కడే ఇంకో విశేషం ఉంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేబ్రోలులో నివసిస్తున్న గృహం ఈయనదే. నెలకి రూపాయి అద్దెకి ఇంద్రభవనంలాంటి నాలుగు అంతస్తుల ఇంటిని ఇచ్చేసారు. ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు ఉండమన్నారు. 2029 ఎన్నికల్లో కూడా ఇక్కడే ఉండి పోటీ చేయమని నాగేశ్వరరావు చెప్పారు. చిరంజీవి, పవన్ కళ్యాణ్ అంటే ఆయనకే కాదు.. ఆయన భార్య, పిల్లలకు కూడా అభిమానం. ఈ అన్ని రకాల మామిడి పండ్లు, బ్లాక్ రైస్ పవన్ కళ్యాణ్ కి ఇచ్చిన తర్వాత మాత్రమే ఆయన తింటారు. ఇక బ్లాక్ రైస్ విక్రయించినప్పటికీ మామిడి పండ్లు కేజీ రెండు లక్షల 70 వేల ఖరీదు చేసే పండు కూడా ఉచితంగానే ఇస్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, బంధువులకు, తన తోట చూపించి వారికి ఇచ్చేస్తుంటారు. అంత ఖరీదైన పండ్లు ఉచితంగా ఇస్తున్నారు కదా అని అడిగితే దేవుడు ఇచ్చాడు, వాటిని పంచిపెడితే మరిన్ని ఇస్తాడు అని ఆనందంగా చెబుతారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాదు దేశం నలుమూలల నుంచి పలువురు రైతులు ఆయన తోటకు వస్తారు. ఆయన సాగు చేసే పొలానికి వస్తారు. మెళుకువలు నేర్చుకుంటారు. నిజంగా రెండు తెలుగు రాష్ట్రాలకు నాగేశ్వరరావు అభ్యుదయ రైతు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

అలా మొదలై... ఇలా ముగిసింది...కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : బుధవారం పెద్దాపురం ముఇన్సపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఎలక్షన్ కోడ్‌లో భాగంగా అలా మొదలై ఇలా ముగిసింది. మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ రోడ్డు డివైడర్ల మధ్య మొక్కలు ఎండిపోతున్నాయని, వాటికి వేసవి దృష్ట్యా వాటరింగ్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీ, మున్సిపల్ డిఇ ఆదినారాయణ, ఏఇ జీవకృష్ణ ప్రసాద్, టిపిఓ ఫణికుమార్, ఆర్వో చంద్రశేఖరం, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, సుభాషిణి, బత్తుల రవి, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు జామాల్ ఖాన్ ట్రస్ట్ పదివేల రూపాయల ఆర్థిక సహాయం

కూనవరం, మేజర్ న్యూస్ : కూనవరం మండలం లోని గొమ్ముగూడెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదం లో రెండు ఇల్లు పూర్తిగా దగ్ధం అయినావి.వివరాల్లోకి వెళితే కంటెం బాబురావు కు చెందిన పూ రిల్లు మరియు కొక్కిరాల అనంత రావు వంట పాక కాలిపోయినవి.ఇంటి వద్ద ఎవ్వరూ ఆసమయంలో లేనందున పూచిక పుల్ల తో సహా కలిపోయి నిలువ నీడ లేకుండా రోడ్డు న పడ్డారు.విషయం తెలుసు కున్న ప్రముఖ ఆయుర్వేద వైద్య లు జమాల్ ఖాన్ వెంటనే గోమ్ముగూడెం గ్రమాము లో జరిగిన సంఘటన వద్దకు వెళ్లి అగ్ని బాధిత కుటుంబాలను పరామర్శించి నారు. అనంతరం జే.కే. సి.టి ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి ఐదు వేల రూపాయల చొప్పున పదివేలు నగదు అందజేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధల్లో ఉన్న వారిని ఓదార్చడం చేతనైన సహాయం చేసి ఆదు కోవటం చేయాల్లన్నారు.ఇంటి నిర్మాణానికి కావలసిన సామాగ్రిని తాను త్వరలో అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు సూఫీ,శ్రీమ%శీ%తుల వెంకట రమణ, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలపై మున్సిపల్ సిబ్బంది తనిఖీలు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో బుధవారం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు పర్యవేక్షణలో శానిటరీ సెక్రటరీలు పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ప్లాస్టిక్ అమ్మకాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 75 మైక్రాన్ల మందం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. మూడు కెజిలు ప్లాస్టిక్ కవర్‌లను స్వాధీనం చేసుకుని వారి వద్ద నుండి అపరాధ రుసుంను వసూలు చేసి, మున్సిపల్ ఖజానాకు జమ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో శానిటరీ సెక్రటరీలు కె.జయరామ్, ఎన్.దుర్గాప్రసాద్, కె.వరప్రసాద్, ఎస్‌కె.అల్తాఫ్, ఎస్‌కె.దాదాజి, సిహెచ్.ప్రత్యూష, డి.సత్తిబాబు, తదితరులు ఉన్నారు.

పంట చేలోకి చొచ్చుకు వస్తున్న ఉప్పునీటిని క్రాస్ బండతో కట్టడి

అల్లవరం, మేజర్ న్యూస్ : అల్లవరం మండలం కొమరగిరి పట్టణం నాలుగో నంబరు ఆయకట్టు భూమిలోకి పంచినది డ్రెయిన్ ద్వారా ఉప్పు నీరు పంట పొలాల్లోకి ప్రవేశించడంతో నీటి పారుదల శాఖ ఏఈ రెహమాన్ స్పందించి బుధవారం తమ సిబ్బందితో క్రాస్ బండ వేసి ఉప్పునీటిని పంట పొలాల్లోకి రాకుండా అడ్డుకట్ట వేసినారు. గతం వారం రోజులుగా పంచి నది డ్రైన్ ద్వారా ఉప్పు నీరు పంట పొలాల్లోకి రావడంతో రైతులు ఆందోళన చెందారు. దీనిపై రెవెన్యూ శాఖ అధికారులకు డ్రైనేజీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు కంప్లైంట్ చేసిన స్పందించలేదు. నీటిపారుదల శాఖ ఏఈ రెహమాన్ స్పందించి ఉప్పునీరు రాకుండా చర్య తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

2 నుండి శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవము



కాకినాడ,మేజర్‌న్యూస్: శ్రీవ్యాసరాజ మఠ పీఠాధిపతులు శ్రీవిద్యాశ్రీశతీర్థ స్వామీజీ సహస్రచంద్ర దర్శన సందర్భంగా జూన్ 2 నుండి 10వ తేది వరకు శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు మఠ ప్రతినిధి డా॥ జి.నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ పీఠాలకు చెందిన స్వామీజీలతో పాటు దేశవ్యాప్తంగా పేరుగాంచిన సుధాపండితులు, ప్రముఖులు పాల్గొంటున్నారు. మైసూర్ నగరంలో జె.పి.నగర్ నందు ఉన్న విఠలధామలో జరుగుతుందని వివరించారు. శ్రీమద్ బ్రహ్మసూత్ర, శ్రీమదను వ్యాఖ్యాన సహిత సుధామంగళ మహోత్సవము జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యిందన్నారు. శ్రీవ్యాసతీర్థ విద్యాపీఠానికి చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను పరీక్షా మూలకంగా పండితుల సమక్షంలో ప్రకటించడం జరుగుతుందన్నారు. స్వామీజీలు మరియు పండితులు అడిగే ప్రశ్నలకు సుధాపరీక్ష ఇచ్చే విద్యార్థులు సమాధానాలు వివరిస్తారని తెలిపారు. 2వ తేది నుండి 6వ తేది వరకు అనేక కార్యక్రమాలు జరుగుతాయని, 7వ తేది నుండి 9వ తేది వరకు న్యాయసుధపై వివిధ పీఠాలకు చెందిన స్వామీజీలు ప్రవచన రూపంలో ఆధ్యాత్మిక అంశాలను వివరిస్తారన్నారు. 7వ తేది సాయంత్రం ఈ కార్యక్రమాన్ని శోభాయాత్రతో ప్రారంభం అవుతుందని, అనంతరం జరిగే సభలో ముఖ్య అతిథులుగా ఉత్తరాధి మఠ పీఠాధిపతులు శ్రీసత్యాత్మతీర్థ స్వామీజీ, శ్రీపాదరాజ మఠాధిపతులు శ్రీసుజయ నిధి తీర్థ స్వామీజీ, శ్రీపలమారు మఠాధిపతులు విద్యాధీశ తీర్థ స్వామీజీ పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. శ్రీకానూరు మఠాధిపతులు శ్రీవిద్యావల్లభ తీర్థ స్వామీజీ, శ్రీఅధమారు పీఠాధిపతులు శ్రీఈశ ప్రియతీర్థ స్వామీజీ, శ్రీపలమారు మఠాధిపతులు శ్రీవిద్యారాజేశ్వర తీర్థులు ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా శ్రీరఘునాథ తీర్థ పేరు మీద పురస్కారాన్ని శ్రీ కె.ఎస్.గురు రాజ, శ్రీ హెచ్.ఆర్. నాగేంద్ర రావు, శ్రీ రఘురామ్‌లకు అంద జేసి సత్కరిస్తారు. 8వ తేదిన నిర్వహించే సభలో శ్రీమంత్రా లయ రాఘవేంద్ర మఠ పీఠాధిపతులు శ్రీసుబుదేంద్ర తీర్థ స్వామీజీ, శ్రీమాధవ తీర్థ మఠ పీఠాధిపతులు విద్యాసాగర మాధవ తీర్థ స్వామీజీ, శ్రీపాదరాజ మఠ పీఠాధిపతులు సుజయనిధి తీర్థ స్వామీజీ, మాధవతీర్థ మఠ పీఠాధిపతులు శ్రీవిద్యావల్లభ మాధవతీర్థ స్వామీజీ, శ్రీఅక్షోభ్యతీర్థ సంస్థానాధిపతులు శ్రీఅక్షోభ్యరామ ప్రియతీర్థ స్వామీజీ, శ్రీవిద్యాసాగర తీర్థ స్వామీజీ (శ్రీకృష్ణాపుర మఠం), శ్రీవిశ్వప్రియ తీర్థ స్వామీజీ (శ్రీఅదమారు మఠం), శ్రీవిద్యాధీశ తీర్థ స్వామీజీ (శ్రీపలమారు మఠం), శ్రీవిశ్వప్రసన్న తీర్థ స్వామీజీ (శ్రీపేజావర మఠం), శ్రీవిద్యావల్లభ తీర్థ స్వామీజీ (శ్రీకానూరు మఠం), శ్రీవిశ్వవల్లభ తీర్థ స్వామీజీ (శ్రీసోదె మఠం), శ్రీఈశప్రియ తీర్థ స్వామీజీ (అదమారు మఠం), శ్రీవిద్యారాజేశ్వర తీర్థ స్వామీజీ (శ్రీపలమారు మఠం), శ్రీవేదవర్ధన తీర్థ స్వామీజీ (శీరురు మఠం) ప్రభృతులు ప్రసంగిస్తారు. 9వ తేది ఉ.9గం. నుండి శ్రీవ్యాసరాజ మఠ పీఠాధిపతులు శ్రీవిద్యాశ్రీశ తీర్థ స్వామీజీచే వేదవ్యాస పూజ, అనంతరం అనుగ్రహ సందేశం చేస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్యాశతీర్థ స్వామీజీ (శ్రీభండారుకేరి మఠం), శ్రీవిద్యాప్రసన్న తీర్థ స్వామీజీ (శ్రీసుబ్రహ్మణ్య మఠం), శ్రీరఘవరేంద్ర తీర్థ స్వామీజీ (శ్రీభీమనకట్ట మఠం), శ్రీవిద్యేంద్ర తీర్థ స్వామీజీ (చిత్రామర మఠం), శ్రీవిద్యాకణ్వ విరాజ తీర్థ స్వామీజీ (కణ్వ మఠం)తో పాటు ప్రముఖ పీఠాధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. అదే రోజు వ్యాసరాజ మఠ పీఠాధిపతులకు సహస్రచంద్ర దర్శన శాంతి హోమాది పూర్ణాహుతి మంగళ హారతి కార్యక్రమాలు జరుగుతాయి. ముఖ్య అతిథులుగా మైసూర్ రాజవంశానికి చెందిన యదువీర కృష్ణదత్త చామరాజ వడయార్, విజయనగర రాజవంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు, విధానసభ సభ్యులు జి.టి.దేవెగౌడ, శ్రీవత్స, హరీష్ గౌడ, రాజ్యవసతి యోజన అధ్యక్షులు యతీంద్ర సిద్ధరామయ్య, మైసూర్ జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు డి.టి.ప్రకాష్, కర్ణాటక రాజ్య బ్రాహ్మణ అభివృద్ధి మండలి అధ్యక్షులు శ్రీ ఆశెగౌడ జయసింహ పాల్గొంటారు. ఈ సందర్భంగా పలువురికి పురస్కార కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ఖైదీలకు ఈ-ములాఖత్ వీడియో కాలింగ్ సదుపాయం

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, జైళ్ల శాఖ, ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశముల మేరకు ఖైదీల సంక్షేమంలో భాగంగా కేంద్ర కారాగారము, రాజమహేంద్రవరం నందు ది. 29.05.2024న ఈ-ములాఖత్ వీడియో కాలింగ్ సదుపాయాన్ని కారాగార పర్యవేక్షణాధికారి యస్. రాహుల్ ప్రారంభించారు. ఇప్పటివరకూ కారాగారములో ఉన్న ముద్దాయిలతో ములాఖత్కు వచ్చిన వారి ద్వారానే మిగిలిన కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాన్ని తెలుసుకోవాల్సి వచ్చేది. కొత్తగా ఏర్పాటుచేసిన ఈ సదుపాయం వల్ల ఖైదీలు వారి కుటుంబ సభ్యులందరినీ ఒకేసారి చూసుకుని వారితో సంభాషించే అరుదైన వెసులుబాటును కారాగార శాఖ కల్పించడం జరిగినది. ఈ ప్రక్రియ ద్వారా ఇతర రాష్ట్రాలలో ఉన్న ఖైదీల కుటుంబ సభ్యులకు ఆర్థిక భారం తగ్గించి, ఈ వీడియో కాలింగ్ ద్వారా ఖైదీల మానసిక అనారోగ్యాలకు చెక్ పెట్టినట్లు అవుతుంది. ముద్దాయిలు వారి కేసులకు సంబంధించి వారి యొక్క న్యాయవాదులతో కూడా వీడియో కాల్ ద్వారా ములాఖత్ కావచ్చు. ఈ ప్రక్రియను నిర్విరామంగా కొనసాగించుట జరుగుతుంది. ఈ-ములాఖత్ కోసం ప్రత్యేకంగా వెబ్సైట్ ను రూపొందించుట జరిగినది. ఖైదీ కుటుంబ సభ్యులు ముందుగా ఆ వెబ్సైట్ ద్వారా ములాఖత్క దరఖాస్తు చేసుకోవాలి. ఈ కారాగార అధికారులు వాటిని పరిశీలించి వారికి నిర్దిష్టమైన తేదీ, సమయాన్ని కేటాయిస్తాము. ఆ వివరాలను ఖైదీకి కూడా తెలియజేస్తాం. ఆ సమయానికి ఖైదీ కంప్యూటర్లోకుటుంబ సభ్యులను చూస్తూ వారితో ముచ్చటించొచ్చు. ఇందుకోసం జైలులో కూడా ప్రత్యేకంగా ఒక గదిని, కంప్యూటర్లను ఏర్పాటుచేయుట జరిగినది. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు భౌతికంగా ములాఖత్క రాలేని వారు ఇకపై ఆన్లైన్ ద్వారా వారానికి రెండుసార్లు నిర్ణీత సమయ వ్యవధితో మాట్లాడుకునే అవకాశం ఇవ్వబడుతుందని, ఈ అవకాశాన్ని ఖైదీల కుటుంబసభ్యులు వినియోగించుకోవాలని పర్యవేక్షణాధికారి శ్రీ యస్. రాహుల్ తెలిపారు.

ప్రతి విద్యార్థి ఒక రామానుజన్ కావాలి

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : ప్రతి విద్యార్థి ఒక రామానుజన్ లా తయారవ్వాలని ప్రముఖ గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కాన్నూరి సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పాలకుడు కవికుండాల సత్యనారాయణ ఆధ్వర్యంలో 15 వ రోజు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం సతీష్ కుమార్ విద్యార్థులకు గణితంలో క్విజ్,పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందించారు. ఉపాధ్యాయులు రాజమండ్రి వాస్తులు ఐ రాజ్ కుమార్ ఉదయం 10.00నుండి 11.30 వరకు చిత్రలేఖనం లో రంగులు ఏవిధంగా కలపాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 27మంది విద్యార్థులుపాల్గొన్నారు.

పెండింగ్ కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలి

-అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ గంధం సునీత ఆదేశాలు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ గంధం సునీత రాజమహేంద్రవరం పరిధిలోని అందరి న్యాయమూర్తులతో, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ల తో సమావేశమయ్యారు. ఈ సమావేశం లో అందరి న్యాయమూర్తులతో మాట్లాడుతూ జూన్ 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నందు అధిక మొత్తంలో సివిల్ కేసులు, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్, చెక్ బౌన్స్ కేసులు మరియు ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ మేరకు పెండింగ్ లో ఉన్న అన్ని కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ల తో మాట్లాడుతూ జూన్ 29 వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నందు రాజమహేంద్రవరం పరిధిలో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల సివిల్ కేసులు, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రీ- లిటిగేషన్ కేసులు. భూ వివాదాలు, ఆస్తి వివాదాలు, రెవెన్యూ కేసులు, మునిసిపాలిటీ కేసులు మరియు రాజీ పడదగిన అన్ని ఇతర కేసులను గుర్తించి వాటిని అధిక సంఖ్యలో పరిష్కరించాలని చెప్పారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్ దృష్ట్యా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లోని అందరి న్యాయమూర్తులతో సమావేశం అయ్యారు. జూన్ 29 వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నందు ఉమ్మడి జిల్లాలో అధిక మొత్తంలో సివిల్ కేసులు, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్, చెక్ బౌన్స్ కేసులు మరియు ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ మేరకు పెండింగ్ లో ఉన్న అన్ని కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు.

బాల బాలికలను పాఠశాలలో జాయిన్ చేయాలి

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో ఆరు సంవత్సరాలు నుండి 18 సంవత్సరాల వయసులోపు బడి బయట ఉన్న బాల బాలికలను గుర్తించి దగ్గర్లో ఉన్న పాఠశాలల్లో జాయిన్ చేయాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏజెన్సీ డీఈఓ, ఏడు మండలాల మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో ఆరు సంవత్సరాలు నుండి 18 సంవత్సరాల వయసులోపు బాల బాలికలను గుర్తించే విధంగా ఇంటింటి సర్వే చేయాలన్నారు. అదేవిధంగా బడి బయట ఉన్న పిల్లలందరినీ దగ్గర్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలల్లో వచ్చేనెల 12వ తేదీన జాయిన్ చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సంవత్సరం పదో తరగతిలో పాసైన బాలబాలికలను ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో జాయిన్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఆరు సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు బడి బయట ఉన్న బాల బాలికల జాబితా తయారుచేసి సమర్పించాలని ఆయన అన్నారు. వచ్చే నెల 12వ తారీకు నుండి పాఠశాలలు తెరిచే లోపు కొత్తగా జాయిన్ అయ్యే బాల బాలికల అడ్మిషన్స్ తీసుకోవాలని ఆయన అన్నారు. స్కూల్లో జాయిన్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులతో పేరెంట్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క మండలంలో ఎన్ని స్కూల్స్ ఉన్నాయి, ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది, జిపిఎస్ స్కూల్స్ ఎన్ని ఉన్నాయి, ఎయిడెడ్ స్కూల్స్ ఎన్ని ఉన్నాయి, యూపీ స్కూల్స్ ఎన్ని ఉన్నాయి, హైస్కూల్స్ ఎన్ని ఉన్నాయి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఎన్ని ఉన్నాయి అదేవిధంగా గత సంవత్సరం ఎంతమంది విద్యార్థులు ఉన్నది మండలాల వారీగా ఆయన ఆరా తీశారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని కోరారు. పాఠశాలల వారీగా ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది, ఎంతమంది విద్యార్థులు ఉన్నది జాబితా తయారు చేసి సమర్పించాలని ఆయన అన్నారు. పాఠశాలలు ప్రారంభం నుండి మధ్యాహ్న భోజన పథకానికి బియ్యం సకాలంలో సరఫరా చేయాలని ప్రాజెక్ట్ అధికారిని మండల విద్యాశాఖ అధికారులు కోరారు. సకాలంలో బియ్యం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. ఈ సమావేశంలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు యస్. బాలు దొర, ఒ.మల్లేశ్వరరావు, తాతబ్బాయి దొర, పి. శ్రీనివాసరావు, బి.తమ్మారావు, యం.రామకృష్ణ, సీనియర్ సహాయకులు యన్.యల్.అర్చన, రమణి, గురుకుల ప్రిన్సిపాల్ ప్రసూన పాల్గొన్నారు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే.సురేష్ బాబు

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : రాబోయే జూన్ 4వ తారీఖున ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని, రామచంద్రపురం పట్టణ పరిధిలో ఎటువంటి కోట్లాటలు, గొడవలు జరగకుండా నిరోధించుటలో భాగంగా రామచంద్రపురం పట్టణం లోని మార్కెట్ సెంటర్ నందు ప్రజలకు అవగాహన కార్యక్రమం పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే.సురేష్ బాబు నిర్వహించారు.

పట్టణ మరియు పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 సిఆర్‌పిసి మరియు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున, నలుగురు అంత కంటే ఎక్కువ మంది గుమికూడడానికి వీలులేదని, ఎగ్జిట్ పోల్స్ వెలువడిన తర్వాత కానీ ఎలక్షన్ ఫలితాలు విడుదలైన తర్వాత గాని భావోద్వాగాలకు లోనయి, ఇతరులను రెచ్చగొట్టడంగానీ, ఇతరులమనోభావాలు దెబ్బ తినేటట్లు ప్రవర్తించడంగాని చేసినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే.సురేష్ బాబు తెలిపారు.

రుచికరమైన భోజనం వడ్డించండి..

- లోపాలకు తావు ఇవ్వకండి
- ఆహార పదార్థాల తయారీలో నాణ్యతకు పెద్దపీట వెయ్యండి
- మధ్యహ్నా భోజన ఏజెన్సీలకు డీఈవో సూచన

గోపాలపురం, మేజర్ న్యూస్ : పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అందించి పిల్లల్లో పోషకాహారలోపాన్ని పోగొట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని..ఆహార పదార్థాలను రుచికరంగా నాణ్యంగా వండి పిల్లలకు వడ్డించడంలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు శ్రద్ధకలిగి పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవుడు అన్నారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు చిట్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణా తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన డీఈవో మాట్లాడుతూ గతంలో పోలిస్తే మధ్యాహ్న భోజనానికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఏ ఆహార పదార్థాల్లో అత్యధిక పోషకవిలువలు ఎక్కువగా ఉంటాయో వాటిని గుర్తించి పిల్లలకు అవే పెడుతున్నట్లు చెప్పారు. పిల్లలు ఇష్టంగా తినే విధంగా వండి పెట్టాల్సిన బాధ్యత మీపై ఉందని ఏజెన్సీలకు ఉద్దేశించి మాట్లాడారు. వంట చేసే సమయంలో వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్నాయని అందరూ సమాయత్తం కావాలని అన్నారు. మధ్యాహ్నా భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ వి.వి.రాజు, మండల విద్యాశాఖ అధికారి ఎ.మహేశ్వరరావు, చిట్యాల కాంప్లెక్స్ ఛైర్మన్ శాస్త్రి, చిట్యాల ప్రధానోపాధ్యాయని ఎ.పద్మావతి, సీఆర్‌పీ.కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు

జగ్గంపేట, మేజర్‌న్యూస్ : గత నాలుగు రోజులుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు ద్వారానే అమ్మకాలు జరుగుతున్నాయి. ఉదయం షాపు తెరిచిన నాటి నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆన్ లైన్ చెల్లింపులు ద్వారా మద్యం అమ్మాలని సాయంత్రం 5దాటిన తరువాత నగదు రూపంలో అమ్మకాలు చేపట్టవచ్చని పైనుంచి మద్యం దుకాణాలకు ఆదేశాలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం దుకాణాలను ప్రభుత్వపరం చేసి చదువుకున్న విద్యార్థులను సేల్స్ పర్సన్స్ గా ఎంపిక చేసుకుని మద్యం అమ్మకాలు ప్రారంభించింది. మద్యపాన నిషేదం చేస్తామని చెప్పి భారీగా మద్యం ధరలు పెంచేశారు. అయితే భారీ ఎత్తున మద్యం అమ్మకాలు జరుగుతున్నప్పటికీ ఆ డబ్బంతా పక్కదారి పడుతుందని ఆన్లైన్ పేమెంట్ విధానం తీసుకురావాలని ప్రతిపక్షాలు కోరిన ప్రభుత్వం చాన్నాళ్లు పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలకు ఆన్లైన్ పేమెంట్ విధానం తీసుకొచ్చినప్పటికీ అది పూర్తిగా వినియోగంలోకి రాలేదు. మొన్న ఎన్నికల్లో సైతం నగదు రూపంలోనే భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. అయితే ఇప్పుడు ఎన్నికల ఫలితాలకు పది రోజులుండగా సరికొత్త నిబంధన తెరపైకి తీసుకొచ్చారు. తప్పనిసరిగా ఆన్లైన్ పేమెంట్ ఉంటేనే అమ్మకాలు జరపాలని సేల్స్ పర్సన్ లకు సూచించారు. ఈ పదిరోజుల్లో ఆన్లైన్ చెల్లింపులు ఎక్కువగా జరగాలనే ఉద్దేశ్యంతో ఈ విధానం ప్రవేశపెట్టారు. దీంతో మందు బాబులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. దాదాపు 70శాతం వరకు కూలీ పనులు చేసుకుని జీవించే వారు మద్యం కొనుగోలు చేస్తుంటారని వారికి ఆన్లైన్ పేమెంట్ చేయడం రాకపోవడంతో తలనొప్పిగా మారింది. డబ్బులిచ్చి మద్యం కొనుక్కుందామంటే ఆన్లైన్లో చెల్లిస్తే కాని మద్యం ఇవ్వమని చాలా చోట్ల చెపుతున్నారు. వంద ఆన్లైన్ చెల్లింపులు జరిగితే మిగతా అంతా నగదు రూపంలో తీసుకుంటామని తమకు వంద చెల్లింపులు టార్గెట్ ఇచ్చినట్లు సేల్స్ పర్సన్లు తెలిపారు. దీంతో మొదట ఆన్లైన్ పేమెంట్ చేయమని చెపుతున్నప్పటికీ అది కుదరని పక్షంలో నగదు తీసుకుని మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి లోపు వంద ఆన్లైన్ చెల్లింపులు అయ్యే మద్యం దుకాణాల వద్ద మందు బాబుల హడావిడి ఎక్కువగా కనిపిస్తుంది. పట్టణాల్లో ఆన్లైన్ చెల్లింపులు ఎక్కువ అవ్వడంతో నగదు రూపంలో మద్యం లభిస్తున్నప్పటికీ పల్లె గ్రామాల్లో మాత్రం చాలా వరకు మందుబాబులు ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనప్పటికీ ఐదేళ్ల అధికారం ముగుస్తున్న తరుణంలో మద్యం ఆన్లైన్ చెల్లింపులపై మందుబాబులు మండిపడుతున్నారు.

పబ్లిక్ నోటీస్

మా క్లయింట్ కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ-2 జగన్నాథపురం, ఏసువారి వీధి డోర్ నెం.54-2-6 కాపురస్తులు లేటు గంపా కోటేశ్వరరావు గారి భార్య గంపా దుర్గాంబ గారు మాకిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా ది.27-05-2024వ తేదీన మా క్లయింట్‌కు చెందిన ఈ క్రింది షెడ్యూలు ఆస్తికి చెందిన ఒరిజినల్ దస్తావేజు పోయినది. మా క్లయింట్‌కు చెందిన ఈ క్రింది షెడ్యూలు ఆస్తి సామర్లకోటలో కలదనియు, సాయంత్రం 3 గంటలకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని చూసి వస్తుండగా, మా క్లయింట్ చేతిలో వున్న ప్లాస్టిక్ బ్యాగ్ సామర్లకోట బస్ స్టాండ్‌లో కనిపించకుండా పోయినది. ఆ బ్యాగ్‌లో నా భర్త గారైన గంపా కోటేశ్వరరావు (లేటు) పేరున వున్న డాక్యుమెంట్ నెం. 230/14 కు చెందిన లింక్ డాక్యుమెంట్ నెం.2506/2002 ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. 27-5-24 తేదీ నుండి 28-5-24 తేదీ వరకు వెదికినా దొరకలేదు. కావు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా ఎవరికైనా దొరికిన సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో గాని, ఈ క్రింది తెలిపినవారికి గాని అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను.

క్రియాస్తికి షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, సామర్లకోట మండలం, సామర్లకోట సబు-డి, తూర్పు గోదావరి జిల్లా పరిషత్‌కి చెందిన సామర్లకోట గ్రామం తాలూకు జిరాయితీ పల్లం, సర్వే నెం. 99/3 రు పూరా య 1-56 ట్లులో య 0-52 ట్లు లేక 0.210 హెక్టార్లు భూమికి హద్దులు.

తూర్పు : ఉప్పు సీతారామయ్య గారి ధర్మసత్రం భూమి.
పడమర : నల్లజర్ల కామేశ్వరరావు గారు విక్రయించిన భూమి.
ఉత్తరం : నలమాటి ధనరాజు గారి తాలూకు యీ నెంబరు భూమి.
దక్షిణం : నలమాటి జనార్దనరావు గారి తాలూకు యీ నెంబరు భూమి.

సదరు హద్దుల మధ్య య. 0-52 ట్లు భూమిన్నీ, యిందలి నీటి వనరులు, మామోలు రివాజు మార్గములు, యీజిమెంటు హక్కులు వగైరాలుతో సహా.

ఇట్లు,
K.V.V.S.N. MURTHY
M.A., M.A., M.A., B.L.
Advocate
52-1-69, Narasimha Road,
Jagannaickpur, Kakinada - 2
9949394515

తేదీ : 30-05-2024
కాకినాడ - 2

పాఠశాల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పడంలో శిక్షణ

కాకినాడ, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కాకినాడ కుళాయి చెరువు పార్క్‌లో గల గాంధీ నగర్ శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో 14వ రోజు బుధవారం నాడు పాఠశాల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పడం, డ్రాయింగ్ మరియు పేపర్ క్రాఫ్ట్ లలో శిక్షణ ఇవ్వడం జరిగిందని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఈమని మూర్తి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పి.వీరబాబు డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్ లో శిక్షణ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.వి.లక్ష్మి విద్యార్థులకు కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం వల్ల ఉపయోగాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ భౌతికశాస్త్రం పరీక్ష

కాకినాడ, మేజర్ న్యూస్ : పదవతరగతి అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలలో భాగంగా బుధవారం భౌతిక శాస్త్రం పేపర్ పరీక్ష జరిగినది. జిల్లా విద్యాశాఖాధికారి 02 పరీక్షా కేంద్రాలును మరియు తనిఖీ అధికార్లు 09 పరీక్షా కేంద్రాలును తనిఖీ చేయడం జరిగినది. మొత్తం 5845 విద్యార్థులకు గాను భౌతిక శాస్త్రం పేపర్ పరీక్షకు 3796 మంది విద్యార్థులు హాజరయినారు. 2049 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినారు. భౌతిక శాస్త్రం పేపర్ పరీక్ష అన్ని పరీక్షా కేంద్రాలలోను ప్రశాంతంగా జరిగినదని మరియు రేపు అనగా ది.30-05-2024 గురువారం నాడు జీవశాస్త్రం పరీక్ష జరుగునని, ఈ పరీక్ష సమయం గం.9:30ల నుండి గం. 11:30ల వరకు జరుగునని, ఇది విద్యార్థుల తల్లిదండ్రులు గమనించగలరని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలియచేసినారు.

పిఠాపురంలో పోలీసుల నాకాబంది

- సరియైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం
- క్షేత్ర స్థాయిలో వేక్షించిన కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పిఠాపురం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఉత్తర్వుల మేరకు బుధవారం సాయంత్రం 5pm నుండి 7pm వరకు పిఠాపురం పట్టణం నందు మొత్తం 18 జంక్షన్లలో కాకినాడ జిల్లాకు చెందిన 130 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు.

పిఠాపురం పట్టణం, చిత్రాడ గ్రామములోని తనిఖీలను స్వయంగా క్షేత్ర స్థాయిలో కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ పర్యవేక్షించారు. ఈ నాకాబంది కార్యక్రమంలో భాగంగా పిఠాపురం పరిధిలో గల 18 జంక్షన్లలో వాహన తనిఖీలు చేసి సరైన రికార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లేని 175 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మోటార్ సైకిళ్ళు కు సంబంధించి సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్, నెంబర్ ప్లేటు సరిగా

లేకపోవడం, ఇన్సూరెన్స్ లేకపోవడం మరియు వాహనం నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం వంటి వివిధ రకాల నేరములను గుర్తించారు. రికార్డులు సరిగా లేక స్వాధీనం చేసుకున్న 175 మోటార్ సైకిళ్లను సంబంధిత పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్ళు యజమానులు సరిఅయిన పత్రాలు చూపి తమ మోటార్ సైకిళ్ళు తీసుకువెళ్ళవచ్చని కాకినాడ సబ్ డివిజనల్ అధికారి డాక్టర్ కె.హనుమంతరావు తెలిపినారు. సరైన పత్రాలు లేని వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి పోలీసు వారువివిధ సెక్షన్ల కింద జరిమానా విధించి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోకాకినాడసబ్‌డివిజనల్‌అధికారిడాక్టర్ కె.హనుమంతరావు, కాకినాడ 1వ, 3వ పట్టణ, పోర్ట్, సర్పవరం మరియు పిఠాపురం ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రత వెరీ 'స్ట్రాంగ్'

- పర్యవేక్షించిన ఆర్వో

కాకినాడ,మేజర్‌న్యూస్: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను కాకినాడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు బుధవారం సందర్శించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా స్ట్రాంగ్‌రూమ్‌ల తనిఖీకి వెళ్ళిన ఆర్వో వెంకటరావు అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత తోపాటు సీసీకెమేరాల నిఘా కూడా ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లను ఇద్దరు గెజిటెడ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు.అనంతరం ఎన్నికల కౌంటింగ్ సెంటర్‌ను కూడా ఆయన సందర్శించారు. అక్కడ కల్పిస్తున్న ఏర్పాట్లు, సదుపాయాలను పరిశీలించారు. ఆయన వెంట పలువురు ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

తేనెటీగలు దాడి ఎనిమిది మందికి గాయాలు

అంబాజీపేట, మేజర్ న్యూస్ : అంబాజీపేట హడ్కోకాలనీ సమీపంలో ఉన్న స్మశాన వాటికకు దహన సంస్కారణ కార్యక్రమం కోసం వెళ్లిన వారిపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఎనిమిదిమంది గాయపడ్డారు. కొర్లపాటివారిపాలెంకు చెందిన కోటిపల్లి సత్యవతి (84) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం దాహన సంస్కారణ నిమిత్తం స్మశానానికి తీసుకువెళ్లారు. చితికి నిప్పు పెట్టిన తరువాత అక్కడ రావి చెట్టుపై ఉన్న తేనె పుట్ట నుంచి ఈగలు ఒక్కసారిగా చెలరేగి దహనసంస్కారం కోసం వచ్చినవారిపై దాడి చేశాయి. ఈ క్రమంలో వచ్చిన వారంతా తువాళ్లతో ముఖాలపై విసురుకుంటూ అర కిలోమీటరు దూరం పరుగులు తీశారు. అయినప్పటికి తేనెటీగలు వెంటాడి ఎనిమిది మంది వ్యక్తులను తీవ్రంగా గాయపరిచాయి. మంట వెలిగించి తేనెటీగలను తరిమి కొట్టేందుకు ప్రయత్నించారు. అయినప్పటికి తీవ్రంగా గాయపరిచాయి. తేనెటీగల దాడిలో గాయపడిన ఎనిమిది మందిని అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యాధికారి బి.కె.శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ విజయ అత్యసర వైద్యం అందించారు.

చిటుకు వ్యాధి నివారణకు టీకాలు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ప్రస్తుతం మే నెలలో మేకలకు, గొర్రెలకు సీజనల్‌గా వచ్చే చిటుకు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, దివిలి పశువైద్యాధికారిణి ఎస్‌కె.మస్తాన్‌బీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ చిటుకు వ్యాధి తొలకరి వర్షాల సమయంలో సోకుతుందని, సంవత్సరం వయసు ఉన్న గొర్రెలలో సోకడం జరుగుతుందని, క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రీన్జెన్స్ అను సూక్ష్మజీవి ఈ వ్యాధి కారకమని, తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వలన ఏప్సిలాన్ అనే విష పదార్థం విడుదల అవడం వలన ఈ లక్షణాలు కనిపిస్తాయని, మేత తీసివేసి, దాణాను ఆకస్మాత్తుగా మార్చడం వలన, ఒకేసారి ఎక్కువ పాలు, మేతను పిల్లలకు అందించడం వలన, శరీరంలో అంతర పరాన్న జీవి ఎక్కువగా ఉండడం వల్ల ఈ వ్యాధి సోకుతుందని వెటర్నరి వైద్యురాలు మస్తాన్‌బీ తెలిపారు. నివారణకు ప్రతీ సంవత్సరం మే నెలలో చిటుకు రోగం నివారణకు టీకాలు స్థానిక పశు వైద్యశాల నందు సిబ్బంది ఆధ్వర్యంలో వేయడం జరుగుతుందని, బూస్టర్ డోస్ 15 రోజుల తరువాత తప్పనిసరిగా వేయించాలని, అలాగే తొలకరిలో జీవాలు కడుపు నిండా మేయకుండా, కొత్త పచ్చికను 3-4 గంటలు మాత్రమే మేసేలా జాగ్రత్తలు పడాలని ఆమె రైతులకు సూచించారు. అలాగే పాలు త్రాగే స్థితి నుండి ఒకేసారి దాణాకు మార్చకుండా క్రమం క్రమంగా మార్చుకుంటూ వెళ్ళాలని ఆమె రైతులకు తెలిపారు.

భీమేశ్వరుని నంది మండపంలో దర్శనం ఏర్పాటు

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయంలో స్వామి వారి శివలింగం జీర్ణద్ధర పను లను బుధవారం ప్రార ంభించారు. దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి ఉత్తర్వులతో స్వామివారి సెంట్రల్ ఆర్కియాలజీ కాకినాడ సిఐ కెవి ఎన్ మూర్తి ఉదయం శివలింగాన్ని జీర్ణోద్ధర పనుల నిమిత్తం ఆలయ కార్యనిర్వాహనాధికారి బళ్ళ నీలకంఠం అప్పగించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక హోమాన్ని సిఎ మూర్తి ఆధ్వర్యంలో ఆలయ పండితులు జరిపించి తదుపరి పనులను ప్రారంభించారు. కాగా ఈ పనులు జూన్ 8వ తేదీ వరకు జరగనున్న క్రమంలో అప్పటి వరకూ భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవారలని భక్తులు దర్శించుకునే విధంగా ఆలయ నంది మండపంలో ప్రత్యేక రీతిలో ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను ఆలయ అధికారులు ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నుండి విచ్చేసిన అర్చకులు, ఉపస్తపతి జి, శ్రీనివాసచార్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్

కాకినాడ, మేజర్ న్యూస్ : ఓటర్ల నిజమైన ఎంపిక సరైన ఓట్ల లెక్కింపులోనే వ్యక్తమవుతుందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఆర్వోలు, ఏఆర్వోలు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్.. జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక ఓట్ల లెక్కింపు, చెల్లుబాటు అయిన ఓట్ల లెక్కింపు, వివరాలు నమోదు వంటి అంశాలపై ఆర్వోలు, ఏఆర్వోలు, సూపర్వైజర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, నిస్పక్షపాతంగా చేపట్టాలన్నారు. ఓటర్ల నిజమైన ఎంపిక సరైన హెూటల్ లెక్కింపులోనే వ్యక్తమవుతుందనే విషయాన్ని గుర్తించి, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సిబ్బంది పని చేయాలని ఆయన తెలిపారు. జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తలతో వ్యవహరించి, ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, పార్లమెంటుకు 14 టేబుల్స్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 25, మొత్తం 39 టేబుల్స్ పైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేకంగా, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఆయా నియోజకవర్గాల ఈవీఎంల కౌంటింగ్ సెంటర్ల వద్ద నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు, చెల్లుబాటు కానివి నిర్ధారణ చేసే విషయంలో ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు చేసిన సూచనలపై అధికారులు ప్రత్యేకంగా అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు, సూపర్వైజర్లు ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నన్నయ్య యూనివర్సిటీలో కొవ్వూరు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

-ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ ఏజెంట్లు సహకరించాలి
-సబ్ కలెక్టర్ ఆర్వో అశుతోష్ శ్రీవాత్సవ్

కొవ్వూరు, మేజర్ న్యూస్ : నన్నయ్య యూనివర్సిటీ లో కొవ్వూరు (ఎస్సీ) అసెంబ్లీ ని యోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని సబ్ కలెక్టర్ ఆర్వో అశుతోష్ శ్రీవాత్సవ్ అన్నారు. బుధవారం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా శ్రీ వాత్సవ్ మాట్లాడుతూనన్నయ్య యూనివర్సిటీ లో జూన్ 4 వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన విధులు నిర్వహించే క్రమంలో నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు. ప్రతీ అభ్యర్థి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్ తో కలిపి ఎన్ని కౌంటింగ్ టేబుల్స్ వున్నవో, అంతమంది కౌంటింగ్ ఏజెంట్లను మరియు అభ్యర్థి లేక వారి ఎలక్షన్ ఏజెంటు లేని సమయంలో కౌంటింగ్ ప్రక్రియ పరిశీలించుటకు ఒక కౌంటింగ్ ఏజెంటును నియమించ కోవచ్చని తెలిపారు. కౌటింగ్ ప్రక్రియకు 5 మంది ఏ ఆర్ ఓ లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఫారం 18 ద్వారా ఆర్వో కి జూన్ 1 వతేదీ సాయంత్రం 5 గంటల లోపుగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ జరిగే కేంద్రానికి ఉదయం 6 గంటలకు హాజరు కావాలని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ప్రారంభిస్తామని తెలిపారు. ఉదయం 8:30 గంటలకు ఈవీఎంలు కౌంటింగ్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి 13 ఏ డిక్లరేషన్ ఉంటేనే పరిగణన లోనికి తీసుకోవడం జరుగు తుందన్నారు. ఈవీఎంలు కౌంటింగ్ నిర్వహించేందుకు 14 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు మూడు టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ, వి.జగదీశ్వర రావు, భారత జాతీ య కాంగ్రెస్ పార్టీ తరఫున గంధం బాపూజీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, తలారి వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ తరఫున ఏ.చక్రధరరావు, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్, కె.శేఖర్ బాబు, స్వతంత్ర అభ్యర్థులు, ఉబా శ్రీకాంత్, కొక్కిరిపాటి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

గోతులమయంగా ప్రధాన రహదారులు

జగ్గంపేట, మేజర్ న్యూస్ : నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట మండలంలో పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు గోతుల మయంగా మారాయి. జగ్గంపేట నుంచి జై కొత్తూరు, రాజపూడి, మల్లిసాల మీదుగా గోకవరం వెళ్లే ప్రధాన రహదారంతా గోతులతోనే దర్శనమిస్తుంది. అదేవిధంగా జగ్గంపేట నుంచి కాకినాడ వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధి చేసినప్పటికీ మధ్య మధ్యలో కొంత భాగం వదిలేశారు. అలాగే జగ్గంపేట మండలం రామవరం నుంచి గోనేడ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. వర్షపు నీరు చేరి ఆ రహదారంతా చిత్తడి చిత్తడిగా మారింది. ఎక్కడికక్కడ రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో అయితే ఈ గోతులు కనిపించగా పలువురు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. మరోపక్క వర్షాకాలం సమయంలో వర్షపు నీరు ఈ గోతుల్లో చేరడంతో రహదారిపై గోతులు కనిపించక వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఆయా రహదారుల్లో ప్యాచ్ వర్కు చేసినప్పటికీ అవి కూడా అంతంత మాత్రమే చేశారని పూర్తిస్థాయిలో రహదారిని అభివృద్ధి పరచలేదని స్థానిక గ్రామస్తులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక అయినా రహదారులు అభివృద్ధి చేస్తారేమో వాటికి మోక్షం కలుగుతుందేమోనని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

కోట ప్రభుత్వాసుపత్రికి బిపి యూనిట్‌లు అందజేత

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట యువత ఆధ్వర్యంలో సామర్లకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు మూడు బిపి పరీక్షల యూనిట్ లు బుధవారం అందజేశారు. ఈ యూనిట్ లను స్థానిక ఎస్ఐ మోనిక చేతులమీదుగా సామర్లకోట యువత అందజేశారు. ఈ సందర్భంగా యువత నాయకులు మాట్లాడుతూ స్థానిక ఆసుపత్రిలో ఉన్న అవసరాన్ని తెలుసుకుని సహాయం కోరగా కాకినాడ సోము దుర్గ ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు రాజ్ కుమార్, స్వాతి లు అందించినట్టు చెప్పారు. కాగా సామర్లకోట యువత అవసరాల్లో ఉన్నవారికి అందించే సహాయ కార్యక్రమాలను అభినదించారు. ఈ కార్యక్రమం లో యువత సభ్యులు దేవగురు చంద్రశేఖర్, జట్లా దుర్గా చైతన్య, జన్మహంతి రోహిత్ సమృద్, అమలకంటి శివ కృష్ణ, గెడ్డం వెంకట్, రెడ్డి నవీన్ సాయి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం అనుమతులు పొందిన సంతాన సాఫల్య కేంద్రాల్లో మాత్రమే వైద్య పరీక్షలు చేయించుకోవాలి

-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కే.వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రభుత్వం అనుమతులు (లైసెన్సులు) పొందిన సంతాన సాఫల్య కేంద్రాల్లో మాత్రమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కే.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం అవ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏఆర్టీ క్లినిక్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కే. వెంకటేశ్వరరావు వారి బృందం కలసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతులు (లైసెన్సులు) పొందిన సంతాన సాఫల్య కేంద్రాల్లో మాత్రమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని, లైసెన్సులు లేని సంతాన సాఫల్య కేంద్రాలకు ఎవరు వెళ్ళవద్దన్నారు.అదేవిధంగా రిజిస్ట్రేషన్ లేని కేంద్రాలలో ఏ విధమైన వైద్యము చేయించుకోరాదని తెలియజేశారు.అవ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్నఏ ఆర్ టి క్లినిక్ లెవెల్ -2 కొరకు అప్లై చేసిన దరఖాస్తులు బట్టి ఆసుపత్రి నందు ఉండవలసిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ వారి బృందంతో పరిశీలించటం జరిగిందన్నారు. అదేవిధంగా అక్కడ ఉండే మానవ వనరులు పరిశీలించటం అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. అప్లై చేసినటువంటి సంస్థ వద్ద ఉండవలసిన సర్టిఫికెట్, ఫైర్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర సర్టిఫికెట్లను పరిశీలించడం జరిగిందని తెలిపారు.నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏఆర్టి సంతాన సాఫల్య కేంద్రానికి అనుమతులు ఇవ్వడం నిమిత్తం వారి తనిఖీ బృందంతో వెళ్లి పరిశీలించడం జరిగిందని తెలిపారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులైన గైనకాలజీ హెచ్ ఓ డి డాక్టర్ అక్కమాంబ పేథాలజీ హెచ్ ఓ డి, పీడియాట్రిషన్ హెచ్ ఓ డి అదేవిధంగా రేడియాలజిస్ట్ , సోషియాలజిస్ట్ ఎన్.అర్జున్ తదితర తనిఖీ బృందం, సత్య కుమార్ నల్లూరి, ఎంపీహెచ్వో నాగు, సిసి రాజు, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్ , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,90,41,964లు

అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో హుండీలు లెక్కింపు నిర్వహించగా శ్రీ సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,90,41,964 లు, యూఎస్ఏ డాలర్లు 83, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ డిన్నర్ 20, ఆస్ట్రేలియా డాలర్స్ 10 ,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సెంట్రల్ బ్యాంక్ 5, ఒమన్ బిసా 100, థాయిలాండ్ తాయి బహ్ట్ 20, బంగారం 168 గ్రాములు, వెండి 1 కేజీ 75 గ్రాములు లభ్యమయ్యాయని దేవస్థానం అధికారులు తెలియజేశారు.ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ మరియు దేవస్థానం అధికారులు సిబ్బంది వ్రత పురోహితులు, అర్చకులు, నాయి బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.